క్లుప్తంగా

13న సత్యవేడులో మెగా జాబ్ మేళా

పిచ్చాటూరు: సత్యవేడులో ఈనెల 13న ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో నియోజక వర్గ స్థాయి మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే పిచ్చాటూరు విలేకరులతో మాట్లాడుతూ ఆరోజు ఉదయం 9 గంటలకు సత్యవేడు పాలిటెక్నిక్ కలాశాలలో జరుగనున్న జాబ్ మేళాలో 15 బహుళ జాతి కంపెనీలు పాల్గొననున్నాయన్నారు. 8వ తరగతి/ 10వ తరగతి, ఇంటర్/ఏదైనా డిప్లొమో/ఏదైనా డిగ్రీ/ బీటెక్ ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. అభ్యర్థులు ఆధార్, 5 బయోడేటా కాపీలు, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో హాజరు కావాలన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.13 వేలు నుంచి రూ.30 వేల వరకు జీతం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గంలోని యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి 9440374535, 9154449677 నంబర్లను సంప్రదించవచ్చని ఎమ్మెల్యే సూచించారు.

రూ.3 లక్షలతో కాలువ నిర్మాణం



పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ సుబ్బయ్య

తొట్టంబేడు(శ్రీకాళహస్తి) : తొట్టంబేడు పంచాయతీ సచివాలయం-1 పరిధిలోని పాతఊరులో మురుగునీటి కాలువల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇటీవల గ్రామస్తులు గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో మురుగునీటి కాలువ దుస్థితిలో ఉందని ఎమ్మెల్యే మధుసూదన్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఆయన జీజీఎం గ్రాంట్ ద్వారా రూ.మూడు లక్షలు మంజూరు మంజూరు చేయించారు. అధికారులు కాలువ నిర్మాణ పనులు ప్రారంభించారు. సమస్యను పరిష్కరించినందుకు సర్పంచ్ సుబ్బయ్య, గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

నాగలాపురం: మండలంలోని కారణి ఎంపీపీ పాఠశాల విద్యార్థులు త్రోబాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం విజయకుమారి తెలిపారు. మంగళవారం విద్యార్థులను పాఠశాలలో ఉపాధ్యాయ బృందం అభినందించింది. హెచ్ఎం మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-14 త్రోబాల్ జిల్లా పోటీల్లో 8వ తరగతి విద్యార్థులు కావ్య, విజయలక్ష్మి జిల్లా జట్టు తరఫున పాల్గొని విశేష ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

పల్లంపేటలో భూ తగాదా ముగ్గురిపై కేసు

ఏర్పేడు: మండలంలోని పల్లంపేటలో భూ తగాదా ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు మంగళవారం ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపారు. పల్లంపేటకు చెందిన చంద్రప్ప నాయుడుకు నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు ఇద్దరు కుమారులు. ఇరు కుటుంబాల మధ్య చాలా ఏళ్లుగా భూ తగాదా నడుస్తోంది. సోమవారం తండ్రి చంద్రప్ప నాయుడుపై ప్రమీల, తేజతో కలిసి వెంకటేశ్వరరావు దాడి చేస్తుండగా, నాగేశ్వరరావు భార్య శారదతో కలిసి అడ్డుకున్నాడు. ఈ ఘటనలో చంద్రప్ప నాయుడు, శారద గాయపడ్డారు. క్షతగాత్రులను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



వరదయ్యపాళెం: మండల కేంద్రంలో మంగళవారం పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. కాలువల్లో పూడికలు తీయక పోవడం, రోడ్లపై చెత్తాచెదారం నిండిపోవడంపై 'లోపించిన పారిశుద్ధ్యం' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై పంచాయతీ అధికారులు స్పందించారు. ఈఓ బసిరెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ పరిధిలోని మురుగునీటి కాలువలు శుభ్ర పరచడంతో పాటు రోడ్ల వెంబడి చెత్తాచెదారాలను తొలగించారు. బ్లీచింగ్ చల్లించారు. ఫాగింగ్ చేసి దోమలు నివారణకు చర్యలు చేపట్టినట్లు ఈఓ తెలిపారు.



సత్యవేడు : మందుల కిట్లను అందజేస్తున్న ఎంపీడీఓ, సర్పంచ్



పిచ్చాటూరు: గోవర్ధనగిరిలో సురక్ష కార్డుల పంపిణీ

ఆరోగ్య సురక్షతో అందరికీ వైద్యం

సత్యవేడు: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలతో ప్రజల ముంగిటకే నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం రాజగోపాలపురంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్పెషలిస్టులు వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని ఎంపీడీఓ, ఎంఈఓ కె.రవి పరిశీలించారు. వైద్య సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి కుటుంబాన్ని ఆరోగ్యంగా ఉంచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తిరుపతి రుయా వైద్యశాల వైద్య నిపుణులు హిమబిందు(గైనకాలజిస్టు), తేజ్‌దీప్ (జనరల్ సర్జన్), కె.హిమగిరి(గైనకాలజిస్టు, దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి గుణశేఖర్ 739 మంది రోగులను పరీక్షించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ మధుసూదన్ రావు, ఎంఈఓ-2 ఉష, పంచాయతీ కార్యదర్శి కే.రజిత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు, ఏఎన్‌ఎంలు, దాసుకుప్పం, పాండూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చాటూరులో 361 మందికి

పిచ్చాటూరు: మండలంలోని గోవర్ధనగిరిలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 361 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు హమీద్, పవిత్ర, గైనకాలజిస్ట్ మోహన, జనరల్ సర్జన్ దినేష్ వైద్య పరీక్షలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు రమేష్ రాజు, తహసీల్దారు మధుసూదన్, సర్పంచ్ శివరామకృష్ణ, జేసీఎస్ కన్వీనర్ తొప్పయ్య, సచివాలయ కన్వీనర్ మునిచంద్రశేఖర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు వరం

నాగలాపురం: ఆర్థిక స్తోమత లేక మెరుగైన వైద్య సేవలను పొందలేని పేదలకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు వరంగా మారాయని ఎంపీడీఓ పీకేఎం బాబు తెలిపారు. మండల కేంద్రంలోని టీపీకోట ఎంపీపీ పాఠశాలలో మంగళవారం జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ శిబిరాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ బీపీ, షుగర్‌తోపాటు మరో ఏడు రకాల వైద్య పరీక్షలను చేస్తునట్లు చెప్పారు. మంగళవారం 460 మందికి నిపుణులు వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అపరంజి రాజు, రైతు సంఘం అధ్యక్షుడు చిన్నదొరై, జెడ్పీటీసీ సభ్యుడు మహేష్ రెడ్డి, ఎంపీపీ సింధు, వైస్ ఎంపీపీ కుమారి ఉదయ్ కుమార్‌రెడ్డి, జీసీఎస్ కన్వీనర్ మోహన్ మొదలియార్, సర్పంచ్‌లు సక్కుబాయి, మదన్ మోహన్ రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఏర్పేడు మండలంలో

ఏర్పేడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలందరికీ ఉచితంగా వైద్య సేవలు అందుతున్నాయని సర్పంచ్ సుబ్బమ్మ అన్నారు. మంగళవారం అముదూరు పంచాయతీ పరిధి పరమాలపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన 210 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. జగనన్న ఆరోగ్య సురక్షపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు నాగరాజు, శివప్రియ, సూపర్ వైజర్‌లు నాగభూషణం, సుబ్బరాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే జగనన్న లక్ష్యం

శ్రీకాళహస్తి: ప్రజారోగ్యమే ముఖ్యమంత్రి జగనన్న లక్ష్యమని వైఎస్సార్ సీపీ నాయకురాలు బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలం కలవగుంట సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. పెద్దసంఖ్యలో చుట్టుపక్కల గ్రామస్తులు విచ్చేసి వైద్య పరీక్షలు చేసుకున్నారు. మందులు, అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి పవిత్రారెడ్డి మాట్లాడుతూ నిపుణులైన వైద్యులు వైద్య సేవలు అందిస్తున్నారని, వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మందుల కిట్లు అందజేస్తున్న పవిత్రారెడ్డి

వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు వయ్యాల కృష్ణారెడ్డి, వైస్‌ఎంపీపీ భానుమూర్తి, పలువురు నాయకులు పాల్గొన్నారు.



నాగలాపురం: రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



ఏర్పేడు : వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ నాగరాజు

వైభవంగా ఏకాదశి ఉత్సవం



నారాయణవనం: తిరుచ్చిపై స్వామివారి విహారం



నాగలాపురం: స్వామివారి ఊరేగింపు

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంలో ఉన్న శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఏకాదశి పూజలు వైభవంగా జరిగాయి. వేకువజామున సుప్రభాత సేవతో నిత్య కైంకర్యాలను పూర్తి చేశారు. ఏకాదశి గడియల్లో అర్చనలు నిర్వహించి, ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. తమిళ పెరటాశిమాసం కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసి శ్రీస్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామిని ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. తదుపరి తిరుచ్చి వాహనాన్ని అధిష్టించి తిరు వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించారు.

శ్రీవేదనారాయణస్వామి ఆలయంలో..

నాగలాపురం: మండల కేంద్రంలోని ప్రముఖ శ్రీవేదవల్లి సమేత వేదనారాయణస్వామి ఆలయంలో ఏకాదశి సందర్భంగా మంగళవారం విశేష పూజలు చేశారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజల అనంతరం తిరుచ్చిపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు.

ఈఓగా సాగర్‌బాబుకు పూర్తి బాధ్యతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం ఈవోగా సాగర్‌బాబుకు ప్రభుత్వం పూర్తి బాధ్యతలు అప్పగించింది. తిరుపతి ఆర్‌జేసీగా విధులు నిర్వహిస్తూ శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం ఈవోగా సాగర్‌బాబు అదనపు బాధ్యతలు నిర్వహించారు. తిరుపతి ఆర్‌జేసీగా మరొకరిని నియమించడంతో శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం ఈవోగా సాగర్‌బాబు పూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు. పాలకమండలి సహకారంతో ఆలయాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

సమాజ సేవలోనే సంతృప్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: సమాజ సేవతోనే సంతృప్తి, గుర్తింపు లభిస్తుందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మంగళవారం మండలంలోని భీమునిచెరువులో గ్లోబెల్ బైబెల్ కార్పొరేషన్(జీబీసీ) చెన్నై విభాగం రూ 1.5 లక్షల వ్యయంతో తవ్వించిన బోరుమోటార్‌ను స్విచ్ ఆన్ చేసి ఆయన ప్రారంభించారు. మినీవాటర్ ట్యాంకును స్థానిక మహిళలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయ ఆవరణలో జరిగిన సమావేశంలో ఆదిమూలం మాట్లాడుతూ అన్నింటికీ ప్రభుత్వం నుంచి ఎదురు చూడకుండా దాతల సాయం తీసుకోవాలని సూచించారు. మండలంలోని కసిమిట్ట జగనన్న కాలనీలో రూ.2 లక్షలతో, భీమునిచెరువులో రూ1.5 లక్షలతో బోరు తవ్వించి, మోటార్‌ను అమర్చి, మినీ వాటర్ ట్యాంకును ఏర్పాటు చేసిన జీబీసీ సేవలు ప్రశంసనీయమన్నారు. సంస్థ చెన్నై డైరెక్టర్ పాల్ రంగనాథన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సూచనలతో ప్రజలకు సేవ చేసే అవకాశం వచ్చిందన్నారు. సంస్థ ప్రతినిధులు రీతూ విల్సన్, కెల్లీ విల్సన్, మిస్టిల్ విల్సన్‌ను సత్కరించారు. అనంతరం భీమునిచెరువులోని సచివాలయాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని, నిర్మాణంలో ఉన్న వెల్‌నెస్‌సెంటర్, గంథాలయ భవనాలను ఆయన పరిశీలించారు. జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్, సర్పంచ్ మురుగేశం, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు



సమావేశంలో పాల్గొన్న ఫౌండేషన్ నాయకులు

శ్రీకాళహస్తి: గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మికత కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు సమరసత సేవా రాష్ట ధర్మప్రచారక్ ముద్దు సాయిరాం తెలిపారు. మంగళవారం పట్టణంలోని శ్రీరామనగర్ కాలనీ సాయిబాబా ఆలయంలో శ్రీకాళహస్తి పట్టణం, మండలం, తొట్టంబేడు, ఏర్పేడు, కేవీబీపురం మండలాల కన్వీనర్లు, మండల కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. సాయిరాం మాట్లాడుతూ రాష్ట్రంలో ఏడు వేల దేవాలయాల్లో పౌర్ణమి హారతులు జరుగుతున్నాయని, ఏకాదశి సందర్భంగా అన్ని మండలాల్లో నగర సంకీర్తనలు, భజన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆధ్మాత్మికతోనే మానిసిక ప్రశాంతత లభిస్తుందన్నారు.

దాడి ఘటనలో భర్తపై కేసు

ఏర్పేడు: మండలంలోని అంజిమేడు పంచాయతీ పరిధి ఎర్రమిట్టలో మద్యం సేవించి భార్యపై దాడి చేసిన ఘటనలో భర్తపై మంగళవారం రాత్రి కేసు నమోదైంది. ఏర్పేడు సీఐ శ్రీహరి కథనం మేరకు ఎర్రమిట్ట గ్రామానికి చెందిన మునిరాజా, సంధ్య దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. మునిరాజా మద్యం సేవించి భార్యను తరచూ వేధిస్తున్నాడు. ఆదివారం మద్యం సేవించి భార్యపై దాడి చేసి గాయపరచాడు. ఆమెను రేణిగుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.